RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 285 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం గురువారం, 18 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-



# పొలిటికల్ హీట్ పెరుగుతోంది!

## పోరుకు సిద్ధం.. - నేటి నుండి నామినేషన్లు

## పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

## సిబ్బందికి శిక్షణ పూర్తి స్థాయిలో శిక్షణ

## ఓటు హక్కు ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు

హైదరాబాద్ / అమరావతి : లోక్‌సభ ఎన్నికల నిర్వహణపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీబిజీగా ఉంది. దేశవ్యాప్తంగా 18వ లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కాగా నేడు (ఏప్రిల్ 18) న నోటిఫికేషన్ వెలువడనుంది.

నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి అధికార యంత్రాంగం పనిచేయనుంది. ఎన్నికల పోలింగ్‌కు ఇంకా 26 రోజుల సమయం ఉండగా అధికారులు ఇప్పటికే ఎన్నికల నిర్వహణపై కసరత్తు చేస్తున్నారు.

పోలింగ్ సజావుగా సాగేలా ప్రణాళిక సిద్ధం చేసుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు శాంతియుతంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా జరిగేందుకు గానూ రెండు రాష్ట్రాల్లోని ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసులు సవాల్‌గా తీసుకుంటున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే నాటికే చేపట్టాల్సిన ప్రక్రియను పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఇప్పటికే నియోజకవర్గాల వారీగా అసిస్టెంట్ రిటర్నిం గ్ అధికారులను నియమించగా తాజాగా పోలింగ్ సిబ్బంది కేటాయింపునకు సంబంధించిన కసరత్తు పూర్తి చేశారు.

**పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ :** ఎన్నికల నేపథ్యంలో పోలింగ్‌లో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బందికి సంబంధించిన మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల యంత్రాంగం పూర్తి చేసింది. పోలింగ్ విధులు నిర్వర్తించే సిబ్బంది వివరాలను క్రోడీకరించి సిద్ధంగా ఉంచుకున్నారు. రెండో విడత ర్యాండమైజేషన్‌లో మండలాల వారీగా కేటాయింపులు చేశారు.

ఈ రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ ఏప్రిల్ మొదటివారంలో ముగిసింది. నియోజకవర్గాల వారీగా కేటాయించిన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగింది. పోలింగ్ సిబ్బందికి శిక్షణ ఇచ్చినప్పటికీ ఎవరెవరికి ఏ పోలింగ్‌కేంద్రాన్ని అలాట్ చేసిన విషయాన్ని పోలింగ్ కు ఒక రోజు ముందుగానే చెబుతారు. సిబ్బందికి శిక్ష ణ పూర్తి కాగానే ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ ను ప్రారంభించారు. ఇందులో భాగంగా మొదటి విడత లో కలెక్టరేట్ స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఈవీఎంలను ఆయా పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి పనితీ రును పరిశీలించారు. ఆ తర్వాత వాటిని నియోజకవ ర్గాల వారీగా పంపిస్తారు. నియోజకవర్గాల్లోని స్ట్రాం గ్‌రూముల్లో రెండో విడత ర్యాండమైజేషన్ చేసి పోలిం గ్‌కు ఒక రోజు ముందు కేంద్రాలకు తరలిస్తారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారా జరుగుతుంది. ఈవీఎంల మొదటి విడత ర్యాండమేజేషన్ ప్రక్రియ నోటిఫికేషన్ వచ్చే ఏప్రిల్ 18 కంటే ముందు జరగనుంది. కాగా.. ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు గానూ జిల్లా ఎన్నికల యంత్రాంగం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గ్రామాలు, మండలాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటు ఆవశ్యకతపై వివరిస్తున్నారు.




హైదరాబాద్ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ప్రచారపర్వం ఊపందుకుంది. పార్టీలకు అతీతంగా సీట్లు ఖరారైన అభ్యర్థులంతా ఉద్ధృతంగా ప్రచారం చేస్తున్నారు. ముఖ్యంగా తెలంగాణ బరిలో ప్రధాన పోటీదారులుగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు హోరాహోరీగా ప్రచారం కొనసాగిస్తున్నాయి. రాష్ట్రంలో మొత్తం 17 లోక్‌సభ స్థానాలు ఉండగా ఎక్కువ స్థానాలు గెలుచేది తామంటే తామంటూ ఏ పార్టీకి ఆ పార్టీ విశ్వాసం వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇండియా టీవీ-సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్ ఆసక్తికరమైన ఫలితాలను వెలువరించింది. కాంగ్రెస్ పార్టీ అత్యధికంగా 8 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొంది.

ఇక బీజేపీ 6 స్థానాలను కైవశం చేసుకోనుందని అంచనా వేసింది. ఇక మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ పార్టీ కేవలం 2 సీట్లకే పరిమితం అయ్యే అవకాశాలున్నాయని విశ్లేషించింది. హైదరాబాద్ ఎంపీ స్థానంలో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ గెలిచే అవకాశం ఉందని పేర్కొంది.

ఈ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా ఖరారైన మాధవి లత చేతిలో ఒవైసీ ఓడిపోయే అవకాశాలు లేకపోలేదని ఇండియా టీవీ - సీఎన్ఎక్స్ ఒపీనియన్ పోల్ విశ్లేషించింది. కాగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో ఒకే దశలో మే 13న ఎన్నికలు జరగనున్నాయి. ఫలితాలు జూన్ 4న వెలువడనున్నాయి. ఇక మొత్తం ఏడు దశల్లో జరగనున్న లోక్‌సభ పోల్స్-2024 ఏప్రిల్ 19న తొలి దశతో షురూ కానున్నాయి. మొత్తం 44 రోజుల పాటు కొనసాగనున్న ఎన్నికల ప్రక్రియలో 10.5 లక్షల పోలింగ్ బూత్‌లలో 97 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోబోతున్నారు. ఇందులో 49.7 కోట్ల మంది పురుషులు, 47.1 కోట్ల మంది స్త్రీలు ఉన్నారని ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ వెల్లడించిన విషయం తెలిసిందే. కాగా ఏప్రిల్ 19న మొదటి దశ, ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1న తదుపరి దశలు వరుసగా జరగనున్నాయి.




## అభ్యర్థుల నామినేషన్లపై తెలంగాణ బీజేపీ నయా ప్లాన్..

## తరలిరానున్న నేషనల్ లీడర్స్

హైదరాబాద్, ఏప్రిల్ 17: తెలంగాణ రాష్ట్రంలో త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. ఇక రేపటి (గురువారం) నుంచి నామినేషన్ల ఘట్టం కూడా మొదలుకానుంది. దీంతో ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు నామినేషన్ల దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇటు తెలంగాణ బీజేపీ మాత్రం నామినేషన్లపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈసారి సరికొత్త రీతిలో నామినేషన్లను వేయించాలని బీజేపీ నిర్ణయించింది. నామినేషన్ కార్యక్రమాలను గ్రాండ్‌గా నిర్వహించేలా ప్రణాళికను రూపొందించింది బీజేపీ కార్యాలయం. అభ్యర్థుల నామినేషన్‌లకు గెస్ట్‌లుగా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, డిప్యూటీ సీఎంలు వచ్చేలా ప్లాన్ చేసింది. అనుకున్నదే తడువుగా జాతీయ నేతలకు స్టేట్ బీజేపీ ఆహ్వానాలు పంపింది కూడా. ఇక.. బీజేపీ అభ్యర్థుల నామిషన్ కోసం గుజరాత్ ముఖ్యమంత్రి, ఛత్తీస్ గడ్ ముఖ్యమంత్రి, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, కేంద్ర మంత్రులు తెలంగాణ రాష్ట్రానికి రానున్నారు. ఒక్కో అభ్యర్థి నామినేషన్ రోజు ఒక్కో నేషనల్ లీడర్ ఉండేలా తెలంగాణ బీజేపీ షెడ్యూల్ ఫిక్స్ చేసింది.




# తెలంగాణ బీజేపీకి భారీ షాక్

## రేవంత్ దెబ్బకు కాషాయ పార్టీ కకావికలం




హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన పరాభవం నుంచి కోలుకోకముందే లోక్‌సభ ఎన్నికల రూపంలో బీజేపీకి గడ్డు కాలం ఎదురైంది. అత్యధి స్థానాలు గెలిచి సత్తా చాటాలని చూస్తున్న కాషాయ పార్టీకి పరిస్థితులు సహకరించడం లేదు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పార్టీపై దృష్టి సారించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు బీజేపీపై దృష్టి పెట్టింది. అధికారం చేపట్టినప్పటి నుంచి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న రేవంత్ రెడ్డి ఇప్పుడు బీజేపీ నాయకులపై వల విసురుతున్నారు. దీంతో రేవంత్ దెబ్బకు బీజేపీ నుంచి పది మంది ఎమ్మెల్యే అభ్యర్థులు జంప్ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల వేళ తెలంగాణలో బీజేపీకి వరుస షాకులు తగులుతున్నాయి. ఆ పార్టీ నేతలు ఒక్కొక్కరుగా రాజీనామా చేస్తూ పార్టీని వీడుతున్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అసెంబ్లీ అభ్యర్థులు పార్టీకి బై బై చెబుతున్నారు. ఇప్పటికే పదిమంది పార్టీకి బైబై చెప్పేశారు. త్వరలోనే మరికొందరు కూడా పార్టీ మారనున్నారని ప్రచారం జరుగుతోంది.

పార్టీని వీడిన వారిలో శ్రీగణేశ్ (కంటోన్మెంట్), కూన శ్రీశైలం గౌడ్, పులిమామిడి రాజు, ఆరెపల్లి మోహన్, రవీంద్ర నాయక్, చలమల కృష్ణారెడ్డి (మునుగోడు), రతన్ పాండురంగారెడ్డి (నారాయణపేట), జలంధర్‌రెడ్డి (మక్తల్), మిథున్‌రెడ్డి (మహబూబ్‌నగర్) ఉన్నారు. పార్టీలో కీలకంగా వ్యవహరించిన మహబూబ్‌నగర్ మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి కూడా పార్టీ మారారు. ఇలా కాషాయ పార్టీలో కీలక నాయకులైన వారికి రేవంత్ గాలం వేస్తున్నారు. అధికార పార్టీ నుంచి ఆహ్వానం వస్తుండడంతో బీజేపీ నాయకులు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు వరుస కడుతున్నారు. కాంట్రాక్ట్‌లు, పదవుల ఆశతో లీడర్లు పార్టీ మారుతున్నారు.

**పాలమూరుపై రేవంత్ దృష్టి :** తన సొంత జిల్లా పాలమూరుపై రేవంత్ రెడ్డి పూర్తి దృష్టి సారించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో రెండు పార్లమెంట్ నియోజకవర్గాలు ఉన్నాయి. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ స్థానాల్లో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో రేవంత్ ఉన్నారు. దీంతో పాలమూరు జిల్లా బీజేపీ దెబ్బకొట్టే ప్రణాళికను రేవంత్ అమలు చేస్తున్నారు. దీనికితోడు తన ప్రధాన ప్రత్యర్థిగా భావిస్తున్న డీకే అరుణను ఒంటరి చేయాలని భావిస్తున్నాడు. నారాయణపేట జన జాతర సభలో కూడా అరుణను లక్ష్యంగా చేసుకుని రేవంత్ విమర్శించిన విషయం తెలిసిందే. ఇలా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసి లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సొంతం చేసుకోవాలని రేవంత్ రెడ్డి వ్యూహం అమలు చేస్తున్నారు. మరి రేవంత్ లక్ష్యం ఫలిస్తుందా? అనేది కొన్ని వారాలు వేచి చూడాలి.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## తెలంగాణ బరి నుండి మోడీ, సోనియా, రాహుల్, ప్రియాంక ఎవరూ లేరు!

ఖమ్మం నుండి ఈ సారి సోనియాగాంధీ పోటీ చేస్తారు. మెదక్ నుండి రాహుల్, హైదరాబాద్ నుండి మోడీ, తెలంగాణ నుండి ప్రియాంక బరిలోకి అంటూ కాంగ్రెస్, బీజేపీ నేతలు గత ఏడాది నుండి పలు మీడియా సమావేశాలలో ఊదరగొట్టారు. తెలంగాణ మీద ఫోకస్, అధిక సీట్లు సాధించి పార్టీ శ్రేణులలో ఉత్సాహం నింపేందుకు ఈ సారి బరిలోకి అధి నాయకులు అంటూ ప్రకటనలు ఇచ్చేవారు. ఇక తమకు సీటు రాదు అనుకున్న కొందరు నేతలు ఆయా స్థానాల నుండి అధిష్టానం పెద్దలు పోటీకి దిగాలని ప్రతిపాదనలు చేస్తుంటారు. ప్రతి సారి లోక్ సభ ఎన్నికల సమయంలో ఇలాంటి ప్రతిపాదనలు చేయడం ప్రహసనంగా మారింది. తెలంగాణలో ఒకటీ, అరా స్థానాలకు పరిమితం అయిన బీజేపీ గత ఎన్నికల్లో నాలుగు లోక్ సభ స్థానాలు గెలుచుకుంది. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో 8 స్థానాలలో విజయం సాధించింది. అయితే అటు లోక్ సభ, ఇటు శాసనసభ ఎన్నికల్లో గెలుపు ఆయా స్థానిక పరిస్థితులు, నిలబడ్డ అభ్యర్థుల వ్యక్తిగత బలాలు తప్పితే బీజేపీకి సంస్థాగతంగా తెలంగాణలో అంత బలం లేదు అన్నది వాస్తవం. గత ఎన్నికల్లో ఎంపీలుగా గెలిచిన ధర్మపురి అరవింద్, బండి సంజయ్ లు శాసనసభకు పోటీ చేసి ఓటమి పాలయ్యారు. లోక్ సభ ఎన్నికల్లో సానుభూతి సాధించేందుకు శాసనసభకు పోటీ చేశారు అన్న వాదన కూడా వినిపిస్తున్నది. అయితే సిట్టింగ్ ఎంపీ సోయం బాపూరావుకు బీజేపీ టికెట్ నిరాకరించడమే ఆ పార్టీకి క్షేత్రస్థాయిలో ఉన్న బలాన్ని తెలియజేస్తుంది. కేవలం మోడీ ఆకర్షణ, జాతీయ వాదం, హిందుత్వవాదం నినాదాలే ప్రాతిపదికగా ఆభ్యర్థుల ఊసులేకుండా ఆ పార్టీ ఎన్నికలలో గెలుపును ఆశిస్తున్నది. అందుకే మోడీ ఇక్కడి నుండి పోటీ చేస్తారు అని ప్రకటనలతో ఊదరగొట్టారు. కానీ మోడీ మాత్రం తన సిట్టింగ్ స్థానం వారణాసి నుండి తిరిగి బరిలోకి దిగారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో అనూహ్యంగా అధికారం దక్కింది. అయితే అది లోక్ సభ ఎన్నికలలో ఎంత వరకు పనిచేస్తుంది అన్నది అనుమానంగానే ఉన్నది. అధికారం ఉంది కాబట్టి గాలివాటంగా గెలుస్తామని ఆ పార్టీ నేతలు తమ కుటుంబ సభ్యులను పోటీకి దించేందుకు తెగ ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికలకు ప్రస్తుతం ఉన్నది 25 రోజులే. కానీ ఇప్పటి వరకు కరీంనగర్, హైదరాబాద్, ఖమ్మం అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించకపోవడం ఆ పార్టీలో ఉన్న గందరగోళానికి నిదర్శనం. అందుకే ఆ పార్టీ నేతలు సోనియా పోటీ చేస్తారు, ప్రియాంక పోటీ చేస్తారు. రాహుల్ వస్తారు అని ఊదరగొట్టారు. అయితే యూపీలో పరిస్థితుల నేపథ్యంలో రాహుల్ తిరిగి మరోసారి కేరళలోని వాయనాడ్ నుండి బరిలోకి దిగారు. ఇక సోనియాగాంధీ నేరుగా రాజ్యసభ సీటు తీసుకుని సరిపెట్టుకున్నారు. ప్రియాంకాగాంధీ ఇంకా రాయ్ బరేలీ, అమేధి, తాజాగా డెహ్రాడూన్ నుండి పోటీ చేస్తారని ఊహాగానాలకే పరిమితం అయ్యారు. గతంలో మెదక్ నుండి ఇందిరాగాంధీ పోటీ చేసిన దాఖలాలు ఉన్నాయి తప్పితే ఇప్పటి వరకు ఉత్తరాదికి చెందిన ఏ అగ్రనేత కూడా తెలంగాణ నుండి బరిలోకి దిగిన దాఖలాలు లేవు. కానీ తరచూ ఎన్నికల ముందు అగ్రనేతలు పోటీకి దిగుతారని స్థానిక నేతలు ప్రకటనలు చేయడం పరిపాటిగా మారింది. రాజకీయాల్లో ఎప్పుడు ఏ అంశం ప్రభావితం చేస్తుందో ఎవరికీ అర్థం కాదు. అందుకే ఏ పార్టీ నేతలయినా ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు సేఫ్ జోన్ నే ఎంచుకుంటారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎన్ని ప్రకటనలు చేసినా ఆయా పార్టీల పెద్దలు తెలంగాణ నుండి పోటీకి మొహం చాటేసి పారిపోయారనే చెప్పాలి.

# చెవులకు చిల్లు.. గుండె ఝల్లు



హైదరాబాద్: నగరంలో శబ్ద కాలుష్యం రోజురోజుకు తీవ్రమవుతోంది. వాహనాల హారన్లు, చెవులు చిల్లులు పడేలా సైలెన్సర్లు, నివాసాల మధ్య డీజే హోరుతో గూబ గుయ్‌మంటోంది. ప్రధానంగా జూబ్లీహిల్స్ నివాసిత ప్రాంతాల్లో పరిమితికి మించి నమోదవుతోంది. శబ్ద తీవ్రత 70 డెసిబుల్స్ దాటితే చెవుడు కూడా వచ్చే ప్రమాదం ఉండగా ఇక్కడ అత్యధికంగా 78.52, 76.25 డెసిబుల్స్‌గా నమోదైందని ఇటీవల పీసీబీ విడుదల చేసిన నివేదిక స్పష్టం చేస్తోంది. నిర్దేశిత పరిమితుల ప్రకారం నివాసిత ప్రాంతాల్లో ఉదయం 55, రాత్రి వేళ 45 డెసిబుల్స్ ఉండాలి. సికింద్రాబాద్, తార్నాకతో పాటు సున్నిత ప్రాంతాలుగా గుర్తించిన జూ పార్కు, హెచ్‌సీయూ వద్ద పరిమితికి మించి శబ్ద కాలుష్యం నమోదవుతోంది. కంటోన్మెంట్ ప్రాంతంలో శబ్దతీవ్రత పెరుగుతోందని అక్కడి స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

ఉల్లంఘనలతో ఉక్కిరి బిక్కిరి.. నిబంధనల ప్రకారం రాత్రి 10గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఎలాంటి సౌండ్ సిస్టమ్స్ ఉపయోగించకూడదు. జూబ్లీహిల్స్‌లాంటి ప్రాంతాల్లో డీజే హోరు మొదలయ్యేది అప్పుడే. దీనికి తోడు అధునాతన పరికరాలు అమర్చిన ద్విచక్ర వాహనాలు, కార్లు రయ్‌రయ్‌మంటూ తిరుగుతుంటాయి. కొందరు ఇదే సమయంలో రేసింగ్‌లతో పాటు విన్యాసాలు చేస్తున్నారు.

హద్దుమీరితే.. చప్పుడు హద్దు మీరితే గుండె కొట్టుకునే వేగం, రక్తపీడనం పెరుగుతుంది. 70 డెసిబుల్స్ దాటితే చెవుడు రావొచ్చు. నిద్రలేమి, తలనొప్పి, అలసటకు ఆస్కారం ఉంది. మానసికంగా, శారీరకంగా కుంగదీస్తుందని నిపుణులు చెబుతున్నారు.

కారణాలివే.. నగరంలో శబ్ద కాలుష్యానికి రవాణా వాహనాలు, పరిశ్రమలు, నిర్మాణరంగ కార్యకలాపాలు, జనరేటర్ల వినియోగం, బాణసంచా కాల్చడం, లౌడ్ స్పీకర్లు, డీజే హోరు తదితరాలు ప్రధాన కారణాలు.

భారీ ట్రక్కులు, వాహనాల డ్రైవర్లు నిరంతరాయంగా హారన్ల మోత మోగిస్తుండటం.

వాహనాల సంఖ్య 77లక్షలకు చేరుకోగా అందులో 15 ఏళ్లు దాటిన వాహనాలను గుర్తించకపోవడం.

యువత ప్రత్యేక అధిక శబ్దాలు వెలువడే హారన్లను వినియోగిస్తుండటం.

గ్రేటర్‌లో 100కు పైగా కూడళ్లు ఉండగా అధిక సమయం వాహనాలు నిలపాల్సి వస్తోంది. ఇక్కడ హారన్ల మోత మోగుతోంది.

నివాస ప్రాంతాలకు ఆనుకొని ఫంక్షన్ హాళ్లు, క్లబ్బులు, పబ్బులు ఏర్పాటుచేస్తుండటం.

రాజధాని పరిధిలో సుమారు 1000 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు ప్రధాన రహదారులు, ముఖ్య కాలనీల్లోనే ఉన్నాయి. రోగులు అధిక ధ్వనులతో ఆందోళనకు గురవుతున్నారు.

# ఒడిసిపడితేనే జలసిరి



పెద్దపల్లి : పల్లెలు, పట్టణాలు కాంక్రీట్ అరణ్యాలుగా మారి, చిన్నపాటి వర్షానికే లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. ఏటా వందలాది క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతోంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా జల సంరక్షణ చర్యలు కరవయ్యాయి. భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలు నామమాత్రంగానే ఉంటున్నాయి. అతివల చైతన్యం అదుర్స్ నాలుగేళ్ల కిందట ప్రతి నీటి బొట్టునూ నేలలోకి ఇంకించేందుకు ఇంటికొక ఇంకుడుగుంత నిర్మించారు. ఇందుకు స్వశక్తి మహిళల భాగస్వామ్యం తీసుకున్నారు. అతివలు ఇంటింటికీ వెళ్లి ఇంకుడుగుంతల ప్రాముఖ్యాన్ని వివరించడంతో పేదలు ముందుకొచ్చారు. ఉపాధిహామీలో భాగంగా జలశక్తి పథకంలో నిధులు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో 1,48,878 ఇంకుడు గుంతలు నిర్మించారు. తర్వాత అధికారులు పట్టించుకోకపోవడంతో ఆశయం అటకెక్కింది.

నిలిచిన బిల్లులు గతంలో ఉపాధిహామీలో నిర్మించిన ఇంకుడుగుంతలకు రూ.4,200 మంజూరు చేయడంతో చాలా మంది పేదలు ముందుకొచ్చారు. అప్పు తెచ్చి నిర్మించుకోగా, బిల్లులు చెల్లింపులో జాప్యంతో ప్రగతిపై ప్రభావం చూపింది. ప్రస్తుతం రూ.6,200కి నిర్మాణ వ్యయం పెరిగింది. సకాలంలో బిల్లులు రాకపోవడంతో ప్రజలు ఆసక్తి చూపడం లేదు.

ఇంటి నిర్మాణ అనుమతికి తప్పనిసరి

పురపాలికల్లో ఇంటి నిర్మాణ సమయంలో ఇంకుడుగుంత నిర్మిస్తామని విధిగా దరఖాస్తు పత్రంలో పేర్కొంటేనే నిర్మాణానికి అనుమతి ఇవ్వాలనే నిబంధన ఉంది. ఇంకుడుగుంత నిర్మాణానికి చదరపు గజానికి 10 చొప్పున కనీసం రూ.2 వేలు చెల్లించాల్సి ఉంటుంది. ఇంటి ఆవరణలో తవ్వుకున్న ఇంకుడుగుంతను పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి నిబంధనల మేరకు ఉంటే రూ.2 వేలు తిరిగివ్వాల్సి ఉంటుంది. అయితే ఈ విషయంలో మున్సిపల్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆశయం నెరవేరడం లేదు.

దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం

ఇళ్ల పైకప్పు నుంచి జాలువారే వాన నీరు, వివిధ అవసరాలకు వాడిన జలాన్ని ఇంకుడుగుంతల ద్వారా నేలలోకి ఇంకించాలి. దీంతో కరవులోనూ బోర్లు ఎండిపోయే అవకాశం ఉండదు. ఉపాధిహామీలో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తాం. ఇంకుడు గుంతలపై ప్రజలను చైతన్యం చేస్తున్నాం.

రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి పెద్దపల్లి

1985లో హైదరాబాద్‌లో తాగునీటి ఎద్దడి తలెత్తడంతో రైల్వే వ్యాగన్ల ద్వారా తరలించి నగరవాసుల దాహార్తి తీర్చారు. 2019లో చెన్నైలో ఏర్పడిన నీటి ఎద్దడి నివారణకు రైల్వే వ్యాగన్ల ద్వారా సరఫరా చేశారు. సింగపూర్ వాసులు ఒకప్పుడు తాగునీటి కోసం మలేషియాపై ఆధారపడేవారు. కుంటలు తవ్వి వర్షపు నీరు అందులోకే వెళ్లేలా చేశారు. అప్పటి నుంచి ఎంతటి కరవు వచ్చినా తాగునీటికి ఇబ్బందులు తలెత్తలేదు. ప్రస్తుతం ఆ దేశంలో భూగర్భ నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. రాష్ట్రంలో తాగునీటి ఎద్దడి ముప్పు ముంచుకొస్తుండటంతో ఇటీవల హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అప్రమత్తంగా లేకుంటే బెంగళూరు మాదిరిగానే నీటి కష్టాలు తప్పవని హెచ్చరించింది.

ఇలా చేస్తే మేలు

ఇళ్లలోని వృథా నీటిని మురుగు కాలువల్లోకి వదలకుండా ఇంకుగుంతలు తవ్వి వాటిలోకి మళ్లించాలి.

సూక్ష్మ, బిందు సేద్యం విధానంతో కూరగాయలు, పండ్ల తోటల పెంపకం చేపట్టాలి.

వ్యవసాయ క్షేత్రాల్లో బోరుబావుల పక్కనే ఇంకుడుగుంతల నిర్మాణం కోసం ఉపాధిహామీ నిధులు వినియోగించుకోవాలి.

గ్రామాల్లో చేతిపంపులు, మురుగుకాలువల నుంచి వచ్చే నీటిని ఇంకించడానికి సామాజిక ఇంకుడుగుంతలు తవ్వించాలి.

బిందెడు నీటికి బండెడు కష్టాలు

ఉమ్మడి జిల్లాలో నీటి ఎద్దడి రోజురోజుకూ తీవ్రమవుతోంది. 2011 జనాభా లెక్కల ప్రచారం జగిత్యాలలో 2,53,619 కుటుంబాలు, పెద్దపల్లిలో 2,09,677, కరీంనగర్‌లో 2,58,485, రాజన్నసిరిసిల్లలో 1,38,992 కలిపి మొత్తం 8,60,773 కుటుంబాలున్నాయి. నాలుగేళ్ల కిందట ఉపాధిహామీ పథకంలో నాలుగు జిల్లాల్లో కలిపి కేవలం 1,48,878 ఇంకుడు గుంతలు మాత్రమే నిర్మించారు.

వాటర్ ఫ్లో మీటరుతో అడ్డుకట్ట

పారిశ్రామిక అవసరాలకు పరిమితికి మించి నీటిని వినియోగించకుండా ప్రభుత్వం నిబంధనలు కఠినతరం చేసింది. ప్రతి బోరు నీటి లెక్కలూ పక్కాగా తేల్చేలా చర్యలు చేపట్టింది. ఇకపై పరిశ్రమల పరిధిలోని బోరుకు 'వాటర్ ఫ్లో మీటరు' బిగించాలన్న ఆదేశాలు అమలుకు నోచుకోవడం లేదు. కర్మాగారాల ఆవరణంలో నీటి వృథాపై పర్యవేక్షణ కొరవడింది. రెవెన్యూ, పోలీసు, భూగర్భ జల శాఖల అధికారులు తనిఖీల్లో సమన్వయ లోపం కనిపిస్తోంది.

అమలుకు నోచని వాల్టా నిబంధనలు

గృహావసరాల తర్వాత వృథా అయ్యే జలాన్ని మొక్కలకు మళ్లించాల్సి ఉన్నా అమలుకు నోచడం లేదు. ఇళ్లలోని వృథా నీరు రోడ్లపైకి చేరి ప్రజలకు అసౌకర్యంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదు. వాల్టా ప్రకారం బోరుబావుల మధ్య 100 మీటర్ల దూరం ఉండాలనే నిబంధనలున్నా వాటిని పక్కనపెట్టి తవ్వేస్తున్నారు. ప్రస్తుతం 400 మీటర్ల లోతు వరకు తవ్వుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, చేతిపంపులు, ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడుగుంతల నిర్మాణంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు.

అయిదేళ్లలో ఒక్కసారీ ఎండిపోలే

ఇంటి ఆవరణలో ఇంకుడుగుంత నిర్మించుకున్నాం. వర్షపు నీరు, ఇంటి అవసరాలకు వాడిన ప్రతి చుక్కనూ అందులోకే మళ్లించాం. ఈ అయిదేళ్లలో ఒక్కసారి కూడా బోరు ఎండిపోలేదు.

బండారి విజయలక్ష్మి, మార్కండేయకాలనీ, గోదావరిఖనిఇంకుడు గుంతలు ఇలా జగిత్యాల: 35,288 పెద్దపల్లి: 52,710 కరీంనగర్: 33,843 సిరిసిల్ల: 27,037

## తవ్వడం.. వదిలేయడం!

కరీంనగర్ : ముకరంపురలోని అంతర్గత వీధిలో కొన్ని రోజులుగా పైపులైను జాయింట్ ఊడిపోయి శుద్ధజలం రోడ్డుపై ప్రవహిస్తోంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఇటీవల మరమ్మతు చేశారు. సీసీ రోడ్డు తవ్విన తర్వాత పైన మట్టి పోసి వెళ్లిపోయారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో రూ.కోట్లు ఖర్చు చేసి సీసీ, బీటీ రహదారులు అభివృద్ధి చేస్తున్నారు. ఆ సమయంలో మళ్లీ తవ్వకుండా ఉండేందుకు వీలుగా హెచ్‌డీపీఈ పైపులైన్లు వేస్తున్నారు. కొన్ని రహదారులపై మాత్రం పాత పైపులైనే ఉంది. అక్కడి నుంచి భారీ వాహనాలు వెళ్లినప్పుడు పైపులు పగిలిపోతున్నాయి. రహదారి మధ్యల్లోంచి నీరంతా పరుగులు పెడుతుంది. మరమ్మతు చేసిన తర్వాత రోడ్డును మరమ్మతు చేయకపోవడంతో గుంతలమయంగా మారుతోంది. రాకపోకలు సాగించే ప్రజలు అవస్థలు పడుతున్నారు.

కనిపించని ప్యాచ్ వర్క్ పనులు తాగునీటి పైపులైన్లు, వాల్వుల మరమ్మతు చేశాక నీటి విభాగం కార్మికులు అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. సీసీ, బీటీ రోడ్లపై ప్యాచ్ వర్క్ పనులు చేయడం లేదు. డివిజన్లు, రిజర్వాయర్ల వారీగా పైపులైన్ల మరమ్మతులు పూర్తయిన తర్వాత కాంక్రీట్, బీటీతో మరమ్మతులు చేస్తే రోడ్లు దెబ్బతినవు. ఆయా ప్రాంతవాసులకు కూడా సౌకర్యంగా ఉంటుంది. కానీ అలా చేయడంలేదు. అయిదారు ఏళ్లకు పూర్తిగా దెబ్బతిన్న తర్వాత కొత్తగా రోడ్డు వేస్తున్నారు. అప్పటి వరకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ప్రత్యేక నిధి అవసరం చిన్న చిన్న సీసీ రోడ్ల ప్యాచ్ వర్క్ పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సిన అవసరముంది. ప్రస్తుతం లీకేజీలకు మరమ్మతులు చేసినా ఆయా ఏఈలకు నయాపైసా రాకపోవడం, జేబుల్లోంచి ఆ మొత్తాన్ని ఖర్చు చేస్తూ నానావస్థలు పడుతున్నారు.

# అవకాశమున్నా.. ఏర్పాటులో నిర్లక్ష్యం

జగిత్యాల : విభిన్న పైర్లసాగుతో జిల్లా రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉన్నా.. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటులో మాత్రం వెనుకంజలో ఉంది. నూతన ఆర్థిక సంవత్సరంలో టీఎస్‌ఐపాస్ ద్వారా యూనిట్లను, పీఎంఈజీపీ యూనిట్లను, టీప్రైడ్‌ద్వారా పెట్టుబడి రాయితీని అధికంగా మంజూరు ఇవ్వాల్సి ఉంది. ముత్యంపేట చక్కెర కర్మాగారం తెరిస్తే కనీసం 55 వేల ఎకరాల్లో చెరకును పండిస్తారు. మూతపడిన సోయాబీన్ నూనెతయారీ పరిశ్రమను తెరిస్తే కనీసం 25 వేల ఎకరాల్లో సోయాబీన్ సాగు పెరుగుతుంది. నాబార్డు రుణాలకు తోడు రాష్ట్రప్రభుత్వం రాయితీలనిస్తే వ్యవసాయ అనుబంధంగా చేపలు, రొయ్యలు, కోళ్లపెంపకం, మేకలు, గొర్రెలు, తేనెటీగల పెంపకం, పాడిపరిశ్రమ, పట్టుపురుగుల పెంపకం తదితరాలను కూడా చేపట్టినపుడు సాగుకు ఆర్థిక ఆసరాగా ఉంటుంది.

పారిశ్రామికప్రాంత స్థానిక ప్రాధికార హోదాతో పరిశ్రమలశాఖ, రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా పల్లెల్లో పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేయాల్సి ఉంది. మెట్లచిట్టాపూర్ వద్ద 150 ఎకరాల్లో ఫుడ్‌ప్రాసెసింగ్ ప్లాంటును నెలకొల్పాలని యోచించినా స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. వెల్గటూరు మండలం స్తంభంపల్లి వద్ద 75 ఎకరాల్లో మెగా ఫుడ్‌పార్కును ఏర్పాటు చేయాల్సి ఉంది. పారిశ్రామిక అభివృద్ధి మండళ్ల కేటాయింపుల్లో భాగంగా జిల్లాకు



మామిడి పరిశోధన కేంద్రాన్ని కేటాయించినా క్షేత్రస్థాయికి చేర్చాలి. పలు గ్రామాల్లో రైతులు ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ ఆర్గనైజేషన్లుగా (ఎఫ్.పి.వో) ఏర్పడగా ఎఫ్‌పీవోలకు పరిశ్రమల ఏర్పాటుకు అవకాశమివ్వాలి.


బియ్యంమిల్లులు, మామిడి తాండ్ర, రసంతయారీ పరిశ్రమలు, పసుపు పాలిషింగ్, పొడి, రంగులు, ఔషధాల తయారీ, మక్కల ఉప ఉత్పత్తులైన కోళ్లదాణా, బిస్కట్లు, గంజిపొడి పరిశ్రమల ఏర్పాటుకు అనువుగా ఉంటుంది. సంకరవరి, సూటివరి, గడ్డిజొన్న, తెల్లజొన్న, ఎర్రజొన్న, ఆవాలు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, నువ్వులు తదితర పంటల్లో విత్తనోత్పత్తి చేపడుతుండగా విత్తనశుద్ధి కర్మాగారాలను, విత్తనోత్పత్తి కంపెనీలను నెలకొల్పవచ్చు. నూనెమిల్లులు, పప్పుమిల్లులు, పత్తి జిన్నింగ్‌మిల్లు, మిరప ఉపఉత్పత్తుల తయారీ మిల్లులను ఏర్పాటు చేయవచ్చు. అరటి, బొప్పాయి, ఇతర పండ్లతోటలు, కూరగాయలసాగు అధికంగా ఉండగా అన్ని పంటల్లోనూ ఆహారశుద్ధి, ఎగుమతి పరిశ్రమలను నెలకొల్పాలి.

# బడిలో దొంగలు పడితే..

కొత్తగూడెం : గతేడాది దసరా సెలవుల్లో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని ఉన్నత పాఠశాలలోకి చొరబడిన ఆకతాయిలు పూటుగా మద్యం తాగారు. మత్తులో గది కిటికీలు, బల్లలు, ఇతర సామగ్రిని ధ్వంసం చేశారు. ఫ్యాన్లు, విద్యుద్దీపాలు లాక్కెళ్లారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాఘవాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని అయిదు కంప్యూటర్లు, మూడు బ్యాటరీలు మాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు అందింది.

ప్రభుత్వ పాఠశాలల్లోని విలువైన సామగ్రికి రక్షణ కరవైంది. రాత్రిపూట కాపలాదారుల్లేక చోరులు ప్రవేశిస్తున్నారు. రాష్ట్రంలో మునుపటి ప్రభుత్వం అమలులోకి తెచ్చిన 'మన ఊరు–మనబడి', కేంద్రం అమలు చేస్తున్న 'పీఎంశ్రీ' పథకాలకు ఎంపికైన పాఠశాలల్లో టెలివిజన్లు, కంప్యూటర్లు, ఇన్వర్టర్లు, డిజిటల్ బోధనోపకరణాలు, సామగ్రి పెద్దఎత్తున సమకూరింది. కొన్నిచోట్ల దాతలు విలువైన సామగ్రి అందజేశారు. త్వరలో వేసవి సెలవులు ప్రారంభంకానుండటంతో పాఠశాలల రక్షణపై హెచ్‌ఎంలకు దిగులు పట్టుకుంది. గతేడాది అవసరమైన చోట తాత్కాలికంగా కాపలాదారుల(వాచ్‌మెన్)ను నియమించుకున్నారు. వారిలో చాలామందికి నెలరోజుల గౌరవ భత్యం రూ.5వేలు ఇప్పటికీ చెల్లించిన పాపానపోలేదు. వారి బ్యాంకు ఖాతాలు, ఆధార్ వివరాలు, హెచ్‌ఎంల ధ్రువపత్రాల సేకరణ పూర్తిచేయలేదు.



మరో రెండు వారాల్లోగా వేసవి సెలవులు ప్రారంభంకానున్నాయి. ఈనేపథ్యలో గతంలో మాదిరిగా తాత్కాలికంగా వాచ్‌మెన్‌లను నియమించుకోవాలా? లేదా? అని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల కోసం జిల్లా అధికారులు ఎదురుచూస్తున్నారు.

దసరా సెలవుల్లో హల్‌చల్

'మనఊరు–మనబడి'లో భాగంగా డ్యూయల్ బల్లలు, ఉపాధ్యాయులకు ఫర్నిచర్ సమకూరాయి. తాగునీటి కుళాయిలు, విద్యుద్దీకరణ, ఇంటరాక్టివ్ ప్యానల్ బోర్డు(ఐఎఫ్‌బీ), కంప్యూటర్లు, బ్యాటరీలు మంజూరయ్యాయి. ప్రహరీలు, కాపలాదారులు లేని విద్యాలయాల్లో విలువైన పరికరాల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. గత దసరా సెలవుల్లో ఉభయ జిల్లాల్లోని వివిధ పాఠశాలల్లో చోరీలు జరిగాయి. ఊరికి దూరంగా చోరులు, ఆకతాయిల బెడద ఎక్కువగా ఉంటుంది. గదులను అపరిశుభ్రంగా మార్చడం, బండలు, టైల్స్ పగలగొట్టడం షరామామూలవుతోంది. కొన్నిచోట్ల రూ.లక్షల సామగ్రికి దిక్కులేకుండా పోతోంది. సెలవుల్లో తాత్కాలికంగా కాపలాదారుల నియామకానికి సంబంధించి రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గతేడాది 'మన ఊరు–మన బడి' పాఠశాలలకు వాచ్‌మెన్లను నియమించాం. వారి వేతనాల మంజూరు ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ఏడాది వీరి నియామకంపై ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నాం. సోమశేఖర్‌శర్మ, డీఈఓ, ఖమ్మం

# అధిక ధరలు.. నాసిరకం తినుబండారాలు

కరీంనగర్ : నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాలకు వెళ్లే వారు ఆర్టీసీ బస్టాండ్లకు చేరుకుంటుంటారు. వారి బస్సు వచ్చే వరకు వేచి ఉంటారు. ఈక్రమంలో దాహాన్ని, ఆకలిని తీర్చుకోవడానికి అందుబాటులో ఉన్న దుకాణాలను ఆశ్రయిస్తారు. ప్రయాణికుల అవసరాలను ఆసరాగా చేసుకుని వ్యాపారులు నాసిరకం వస్తువులు అంటగడుతూ అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రశ్నిస్తే.. అది అంతే అన్నట్లుగా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. కరీంనగర్ బస్టాండ్‌లోని దుకాణాల్లో అధిక ధరలు, నాసిరకం తినుబండారాల పై కథనం.నాణ్యత ఉండదు.. ఎమ్మార్పీ నడవదు

కరీంనగర్ బస్టాండ్‌లో 45 ప్లాట్‌ఫాంలు ఉండగా.. ప్రతి రోజు 1500కు పైగా బస్సు ట్రిప్పులు నడుపుతారు. నిత్యం 1.25 లక్షలకు పైగా ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రయాణ ప్రాంగణం ఆవరణలో 72 స్టాళ్లు ఉన్నాయి. ఇందులో కొన్ని గడువు ముగియగా మరికొన్నింటికి ఎన్నికల కోడ్ ఉండటంతో కొత్తగా టెండర్లు వేయలేదు. ప్రస్తుతం 45 వరకు దుకాణాలు నడుస్తున్నాయి. కరీంనగర్ బస్టాండ్‌లో నీళ్లసీసాలు, శీతల పానీయాలు(కూల్‌డ్రింక్స్), సమోసా, మిర్చి, చిప్స్, బిస్కెట్ ప్యాకెట్లు, ఇతర తినుబండారాలు, వస్తువులు విక్రయిస్తుంటారు. దూర ప్రాంతానికి వెళ్లే వారు వీటిని కొనుగోళ్లు చేస్తుంటారు. దీనిని ఆసరా చేసుకుని వ్యాపారులు గరిష్ఠ అమ్మకపు ధర (ఎమ్మార్పీ) కంటే అధికంగా విక్రయిస్తున్నారు. వాటిలో కొన్ని నాసిరకంవి ఉంటున్నాయి.

ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా..



వేసవి కావడంతో నీళ్ల సీసాల విక్రయాలు ఎక్కువగా ఉంటున్నాయి. లీటర్ నీళ్ల సీసాకు బయట రూ.20కి విక్రయిస్తుండగా బస్టాండ్‌లో సందర్భాన్నిబట్టి కొందరు రూ.25 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. మరికొందరు బాటిల్‌పై వేరే స్టికర్లు అతికించి రూ.25 ఎమ్మార్పీగా చూపిస్తున్నారు. పెద్ద కంపెనీల వాటర్ బాటిళ్లు కాకుండా తక్కువ ధరకు లభించే కంపెనీలవి అంటగడుతున్నారు. సమోసా, మిర్చి, బజ్జీలు వంటి తినుబండారాలను రెండు, మూడురోజుల క్రితం చేసిన వాటిని కూడా విక్రయిస్తుంటారు. వాటిపై ఈగలు, దోమలు వాలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అయినా తూనికల, కొలతల శాఖ, ఫుడ్ సేఫ్టీ అధికారులు పట్టించుకోవడంలేదు.

ప్యాకింగ్‌పై వివరాలు లేకుండానే..

నిబంధనల ప్రకారం వినియోగదారులకు విక్రయించే ప్రతి ప్యాకింగ్‌పై తయారీదారు చిరునామా, తయారీ, గడువు తేదీలు, చరవాణి లేదా కస్టమర్ కేర్ నంబర్‌లు ముద్రించాలి. కానీ చిప్స్, ఇతర తినుబండారాల ప్యాకెట్లపై ఎప్పుడు తయారు చేశారు, గడువు ముగింపు తేది, తయారీ కేంద్ర చిరునామా వంటి వివరాలు ఏవీ కనిపించట్లేదు. ఇలాంటివి తిని ప్రయాణికులు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది.

మా దృష్టికి తీసుకురావాలి

ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయించినా, నిర్దేశించిన ప్రమాణాలు పాటించకున్నా.. ఆ దుకాణాలకు జరిమానా విధిస్తున్నాం. ప్రయాణికులు ఎవరైనా నిర్భయంగా మాకు చెప్పవచ్చు. జరిమానా విధించడంతో పాటు నోటీసులు జారీ చేస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వ్యాపారులపై చర్యలు కూడా తీసుకుంటాం.

రజనీకృష్ణ, ఏటీఎం, కరీంనగర్ బాధ్యులెవరు?బస్టాండ్లలో ఎమ్మార్పీ ప్రకారం విక్రయాలు సాగుతున్నాయా.. ఐఎస్ఐ గుర్తింపు ఉందా? వంటి వాటినే ఆర్టీసీ అధికారులు పరిశీస్తున్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా బస్టాండ్లలో నాసిరకం తినుబండారాలు, వస్తువులు, నీళ్ల సీసాలు, శీతల పానీయాలు విక్రయిస్తే ఆయా దుకాణ యజమానులకు రూ.1000 వరకు జరిమానా విధిస్తారు. వ్యాపారులు దీనిని కూడా లెక్క చేయడం లేదు. అధిక ధరకు విక్రయిస్తే తూనికల, కొలతల శాఖాధికారులు, నాసిరకం తినుబండారాలు, ఆహార పదార్థాలు అమ్మితే ఫుడ్ సేఫ్టీ అధికారులు బాధ్యత వహించాలి. కానీ వారు తనిఖీలు చేసిన దాఖలలు మచ్చుకైనా లేవు.

# శాతవాహన దశ మారదా?

కరీంనగర్ : శాతవాహన విశ్వవిద్యాలయం సమస్యలతో సతమతమవుతోంది. అభివృద్ధి మాట పక్కకు పెడితే.. విద్యార్థులకు సరైన వసతులు కల్పించలేకపోతున్నారు. విశ్వవిద్యాలయ పాలకవర్గం ఏటా రూ.కోట్లలో రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల ప్రతిపాదనలు పంపుతున్నా.. ఆశించిన స్థాయిలో రావడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం శాతవాహన విశ్వవిద్యాలయానికి బోడ్జెట్‌లో ఏటా అరకొర నిధులే కేటాయిస్తోంది. బడ్జెట్‌లో కేటాయించిన నిధులు అధ్యాపకుల జీతభత్యాలకే సరిపోవడం లేదు. బోధనేతర సిబ్బందికివిశ్వవిద్యాలయ పద్దు నుంచే అందజేస్తున్నారు. కనీసం యూనివర్సిటీ ఆస్తులను సైతం కాపాడుకోలేని పరిస్థితి నెలకొంది.

అమలుకు నోచని ప్రతిపాదనలు

విశ్వవిద్యాలయంలో మౌలిక వసతులకు ప్రతిసారి ప్రతిపాదనలు తయారు చేసి పంపుతున్నారు. కానీ ఏటా కేటాయింపుల్లో నిరాశే ఎదురవుతోంది. కేంద్ర ప్రభుత్వం తదితర వాటి నుంచి పెద్దగా నిధులు రాకపోవడంతో యూనివర్సిటీ పరిధిలో అనేక సమస్యలు నెలకొన్నాయి.

ఉజ్వల పార్కు సమీపంలో ఉన్న ఫార్మసీ కళాశాల మైదానం ప్రహరీ లేక కబ్జాకు గురవుతోంది.

దాదాపు ఏడేళ్ల నుంచి మెస్ ఛార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులు చందాలు వేసుకుంటున్నారు.

విశ్వవిద్యాలయంలోని వసతి గృహానికి వెళ్లే దారిలో లైట్లు లేక ఇబ్బందులు పడుతున్నారు.

అదనపు కోర్సులు, భవనాల నిర్మాణం, లా, బీఈడీ, ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాల్సిన అవసరముంది.

యూనివర్శిటీ ఆవరణలో స్టేడియం, ఫుట్‌బాల్ మైదానం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, సింథటిక్ ట్రాక్, ఇండోర్ స్టేడియం తదితర వాటి నిర్మాణం నిధుల లేమితో జరగడం లేదు.ఉన్నత విద్యకు ప్రాధాన్యమివ్వాలి గత ప్రభుత్వం యూనివర్శిటీల అభివృద్ధిని పట్టించుకోలేదు. శాతవాహన విశ్వవిద్యాలయం ఏర్పడి 16 ఏళ్లవుతున్నా విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత విద్యకు ప్రాధాన్యమిచ్చి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిన అవసరముంది.

# పథకాల నిర్వహణ.. అధికారుల కార్యాచరణ



తాండూరు: తాండూరు పట్టణ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు కాగ్నా నది ఒడ్డున ఏర్పాటు చేసిన రెండు నీటి సరఫరా పథకాలు నిరుపయోగంగా మారాయి. వీటిని వినియోగంలోకి తీసుకు వస్తే పట్టణ ప్రజలకు వేసవిలో ఎద్దడి లేకుండా నీటిని సరఫరా చేయొచ్చు. ఇందుకోసం అధికారులు కార్యాచరణ చేపట్టారు. ఐదు దశాబ్దాల కిందట మొదటి పంప్‌హౌస్ ఏర్పాటు చేశారు. నదిలో మూడు ఇన్‌ఫిల్టరేషన్ బావులను నిర్మించారు. ప్రధాన బావిపైనే పంప్‌హౌస్ నిర్మించారు. ఇందులో 30 అశ్విక శక్తిగల రెండు మోటార్లను బిగించి, వీటికి అనుసంధానంగా ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేశారు. పట్టణంలో నాలుగు ట్యాంకులు నిర్మించి, రెండు పూటలా నీటిని సరఫరా చేశారు.

2007లో మరోటి నిర్మాణం పట్టణ విస్తీర్ణం పెరిగి, 2007 నాటికి జనాభా 50 వేలకు చేరింది. తాగునీటి అవసరం 6ఎంఎల్‌డీ( మిలియన్ లీటర్ ఫర్ డే)కి చేరింది. ఈ నేపథ్యంలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు పట్టణానికి రెండు కిలోమీటర్ల దూరంలో కాగ్నా పక్కనే ప్రభుత్వం మరో పంప్‌హౌస్‌ను నిర్మించింది. నదిలోనే రెండు ఇన్‌ఫిల్టరేషన్ బావులతో పాటు, మరో ప్రధాన బావిని నిర్మించారు. అంబేడ్కర్ పార్కు, లారీ పార్కింగ్ వద్ద ఒక్కో ట్యాంకు నిర్మించారు. మొత్తం పథకానికి రూ.5.80 కోట్లు ఖర్చు చేశారు. పంప్‌హౌస్‌ల నుంచి వచ్చే నీటిని ట్యాంకుల్లో నిల్వ చేసి పట్టణంలోని అన్ని వార్డులకు సరఫరా చేయడంతో, ఎద్దడి తలెత్తలేదు. నదిలో ప్రవాహం తగ్గి బావులు అడుగంటినపుడు కోట్‌పల్లి జలాశయం నుంచి నీటిని బావుల్లో నిల్వ చేసి సరఫరా చేశారు.భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పెరిగే జనాభా, పట్టణ విస్తరణను దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి రాకుండా ఇంజినీర్లు ముందస్తు ఆలోచన చేశారు. ఇందులో భాగంగా వర్షాకాలంలో కాగ్నాలోకి వచ్చే వరద దిగువకు వృథాగా పోకుండా ఉండేందుకు ఆనకట్ట నిర్మించాలని 2014లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఆమేరకు అప్పటి ప్రభుత్వం రూ.8.53 కోట్లు మంజూరు చేసింది. 2016లో పాత పంప్‌హౌస్ దిగువన నదికి అడ్డంగా ఆనకట్ట నిర్మించారు. కిలోమీటరు పొడవునా 0.9 టీఎంసీ నీరు నిల్వ ఉండడంతో పంప్‌హౌస్ వద్ద జలకళ ఉట్టిపడింది. పెరిగిన జనాభాకు తగ్గట్టు 8 ఎంఎల్‌డీ తాగునీటి సరఫరా మెరుగ్గా జరిగింది. ఐదేళ్ల నుంచి వృథాగా..గత ప్రభుత్వం మిషన్ భగీరథ నీటి సరఫరా ప్రారంభం కాగానే 2019 నుంచి రెండు పంప్‌హౌస్‌లను వినియోగించడం లేదు. ప్రస్తుతం కొత్తగా నిర్మించిన రెండు ట్యాంకులకు తోడు, పాత ఆరు ట్యాంకుల ద్వారా స్థానికులకు నీటిని సరఫరా చేస్తున్నారు పట్టణంలో అధికారిక జనాభా 71 వేలు. అనధికారిక లెక్కల ప్రకారం లక్షకు పైగా ఉంది. రోజువారీగా 12 ఎంఎల్‌డీ నీటి సరఫరా కావాలి. ప్రస్తుతం 9 ఎంఎల్‌డీ మాత్రమే సరఫరా జరుగుతోంది. దీంతో పట్టణంలోని చాలా కాలనీలు ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఈ పరిస్థితిలో నది ఒడ్డున ఉన్న పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే తాగునీటిని సరఫరా చేయవచ్చు.మోటార్లకు మరమ్మతు చేయిస్తున్నాం- ఖాజాహుసేన్, డీఈఈ వేసవి నేపథ్యంలో పంప్‌హౌస్‌లను వినియోగంలోకి తీసుకు రావాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు మోటార్లను మరమ్మతు చేయిస్తున్నాం. పది రోజుల్లో మోటార్లను బిగించి పట్టణ వాసులకు ఎద్దడి లేకుండా నీటిని సరఫరా చేస్తాం. తర్వాత మరో పంప్‌హౌస్‌ను అందుబాటులోకి తీసుకువస్తాం.

# నీరు రాదు.. నిర్వహణ లేదు




హైదరాబాద్ : ప్రజా మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. నీరు లేదంటూ గుత్తేదారులు నిర్వహణను వదిలేశారు. అధికారులు నెలవారీ మామూళ్లు తీసుకుని.. నిర్వహణ బిల్లులపై సంతకాలు చేస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ర్యాంకుల కోసం మూడేళ్ల కిందట నగరవ్యాప్తంగా దాదాపు 6 వేల మరుగుదొడ్లు ఏర్పాటు చేయగా, ప్రస్తుతం చాలావరకు గల్లంతయ్యాయి. ఇటీవల 2,173 ఉన్నట్లు అధికారులు లెక్క తేల్చారు. ఇవి కూడా శుభ్రంగా లేవు.

ఇదీ పరిస్థితి.. నీరు లేకపోవడంతో ఎర్రగడ్డ ఆయుర్వేద ఆసుపత్రి ఎదురుగా కాలిబాటపై ఉన్న మరుగుదొడ్డి చాలా రోజులుగా మలవ్యర్థాలతో నిండి ఉంది. వెంగళరావునగర్ కల్యాణ్ నగర్ చౌరస్తా వద్ద నున్న మరుగుదొడ్డి నిరుపయోగంగా మారింది.

దిల్‌సుఖ్‌నగర్ బస్టాండు పరిసరాల్లో ఒక్కటీ పని చేయట్లేదు. సాయిబాబా గుడి నుంచి దిల్‌సుఖ్‌నగర్ చౌరస్తా వెళ్లే రోడ్డులో నాలుగేళ్ల క్రితం ఈ-టాయిలెట్ ఏర్పాటు చేయగా, ప్రారంభించిన నెల రోజులకే మూతపడింది. వాటి పక్కనున్న ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్ల పరిస్థితి అంతే.

వీఎస్టీ కూడలి నుంచి రాంనగర్ వెళ్లే రోడ్డులోని ప్రీ ఫ్యాబ్రికేటెడ్ మరుగుదొడ్ల నిర్వహణ సరిగా లేదు.

పాతబస్తీ మొఘల్‌పుర క్రీడా ప్రాంగణంలో సుమారు పది ప్రీ ఫ్యాబ్రికేటెడ్ టాయిలెట్లు మూలకుబడ్డాయి.

ఐఎస్ సదన్ డివిజన్ సైదాబాద్ బిస్కట్ ఫ్యాక్టరీ దోబీఘాట్ వద్దనున్న మరుగుదొడ్లకు తలుపులు, విద్యుత్తు, నీటి కనెక్షన్లు లేవు.

పేరుకే నిబంధనలు.. ఒక్కో మరుగుదొడ్డి నిర్వహణకు బల్దియా రూ.4 వేలు చెల్లిస్తోంది. మరుగుదొడ్లలో గుత్తేదారు లిక్విడ్ సోప్, నీటి వసతి కల్పించాలి. 500 లీటర్ల నీటి ట్యాంకును రోజూ నింపాలి. భూగర్భంలోని ట్యాంకులోని మల వ్యర్థాలను ఏరోజుకారోజు మురుగు శుద్ధి కేంద్రాలకు తరలించాలి.

ప్రతి నిర్మాణాన్ని 4 గంటలకోసారి శుభ్రం చేయాలి. 15 టాయిలెట్లను ఓ క్లస్టర్‌గా విభజించి.ప్రైవేటు నిర్వహణకు అప్పగించారు. సెలవు రోజుల్లోనూ శుభ్రం చేయాలి. చుట్టూ 50 మీటర్ల పాటు వ్యర్థాలు, బహిరంగ మూత్ర విసర్జన జరగకుండా చూడాలి. బ్లీచింగ్ పౌడరు, సున్నం చల్లాలి.శుభ్రం చేయకపోతే రోజుకు రూ.1,000 జరిమానా, ఫినాయిల్, యాసిడ్ వాడకపోయినా, క్రిమి సంహారక రసాయనాలు వినియోగించకున్నా..రూ.100 చొప్పున జరిమానా ఉంటుంది. ఎవరి నుంచైనా ఫిర్యాదు అందితే గుత్తేదారు రూ.300 జరిమానా చెల్లించాల్సిందే.

# తాగేది.. శుద్ధ జలమేనా?


హైదరాబాద్: అసలే వేసవి కాలం..ఆపై జలాశయాల్లో నీటి మట్టాలు తగ్గడంతో నగరంలో నల్లా నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో చాలామంది నీటి శుద్ధి కేంద్రాలపై ఆధారపడుతున్నారు. దీన్ని ఆసరాగా తీసుకొని ప్లాంట్ల నిర్వాహకులు.. నిబంధనలు బేఖాతరు చేస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్, బీఐఎస్, ఆహార కల్తీ నిరోధక శాఖ అనుమతులు లేకుండానే వ్యాపారం చేస్తున్నారు. అపరిశుభ్ర వాతావరణంలో శుద్ధి చేస్తున్న నీటిని సురక్షితమని భావించి వినియోగిస్తూ.. ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. భాగ్యనగరంలో ఏటా వేసవిలో వాటర్ ప్లాంట్ల కేంద్రంగా రూ.కోట్ల వ్యాపారం జరుగుతుంది. నగర వ్యాప్తంగా వేల సంఖ్యలో నీటి శుద్ధి కేంద్రాలు ఉన్నా.. నిర్వహణను పట్టించుకునేవారు కరవయ్యారు.

తోడేస్తున్నారు..నగరంలో చాలావరకు వాటర్ ప్లాంట్ల నిర్వాహకులు బోరు నీటినే ఉపయోగిస్తున్నారు. కొందరు ఇంటి అవసరాలకు తీసుకున్న బోరుని వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలంటే సుమారు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఖర్చు అవుతుంది. కానీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, నీటి శుద్ధికి అవసరమైన యంత్రాలు కొనుగోలు చేయకుండా రూ.2 నుంచి రూ.5 లక్షలతో ప్లాంట్ ప్రారంభిస్తున్నారు. అనధికారికంగా చిన్న చిన్న గదుల్లో ప్లాంట్లను ఏర్పాటు చేసి, రూ.లక్షలు దండుకుంటున్నారు.

నిబంధనలు ఇలా..

నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటుకు మున్సిపాలిటీ అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాలి. ఈ ఎన్‌వోసీ ఆధారంగా ప్లాంట్ ఏర్పాటుకు విద్యుత్తు శాఖ నుంచి కనెక్షన్ పొందాలి.

బీఎస్ఐ ధ్రువ పత్రం, ట్రేడ్, ఫుడ్ లైసెన్స్‌లు తప్పనిసరి.



నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షకు ల్యాబ్, పరికరాలు, రసాయనాలు ఉండాలి. బీఎస్ఐ నిబంధనల ప్రకారం మైక్రో బయాలజిస్ట్, కెమిస్టులను నియమించుకోవాలి.

నీటిని 12 సార్లు శుద్ధి ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. అనంతరం నీటిని డబ్బాల్లో నింపే ముందు 48 గంటలపాటు నిల్వ ఉంచాలి. అనంతరం కెమిస్ట్ పరీక్షలు జరపాలి. ఇందుకోసం మైక్రో బయలాజికల్ ల్యాబ్ ఉండాలి.

తరలింపులోనూ నిర్లక్ష్యం..ప్లాంట్ నుంచి వినియోగదారుల వద్దకు నీటిని తరలించే క్రమంలో జాగ్రత్తలు పాటించడం లేదు. 40 డిగ్రీలు దాటిన ఎండలో ప్లాస్టిక్ డబ్బాల్లో తరలిస్తున్నారు. వాటిపై ఎండ పడకుండా చర్యలు తీసుకోవడంలేదు. నీటి శుద్ధికి చాలా సమయం పడుతుంది. డిమాండ్ రీత్యా తూతూ మంత్రంగా శుద్ధిచేసి విక్రయిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో రోజులతరబడి క్యాన్లను శుభ్రం చేయడం లేదు. ప్లాస్టిక్ డబ్బాలను కాలపరిమితికి మించి వాడటం నిషిద్ధమని తెలిసినా.. పట్టించుకోవడం లేదు.

# సామాజిక మాధ్యమాల్లో.. జర జాగ్రత్త!

గోదావరిఖని : చేతిలో స్మార్ట్‌ఫోన్.. ఇంకేముంది ఇష్టం వచ్చినట్లుగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడతామని అనుకుంటున్నారా..? అయితే మీరు చిక్కుల్లో పడక తప్పదు. మత, రాజకీయ, వ్యక్తిగత అంశాలకు సంబంధించి ఇతరుల మనోభావాలు దెబ్బతీసేలా వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి పోస్టులు పెట్టినా పోలీసు కేసులను ఎదుర్కోవాల్సిందే. జైలు ఊచలు లెక్క పెట్టాల్సిందే. సాధారణ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సామాజిక మాధ్యమ పోస్టింగ్‌లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఇచ్చే లీకులను పోస్టు చేస్తే, ఆ తర్వాత లీకులు ఇచ్చిన వారే అది తప్పుడు పోస్టంటూ ఫిర్యాదులు చేసే అవకాశముంది. ఎన్నికల వేళ ప్రత్యర్థి పార్టీల నాయకులు, అభ్యర్థులు పరస్పరం తీవ్ర స్థాయిలో విమర్శలు చేసుకుంటున్నారు. ఇప్పటికే ఒకరిపై ఒకరు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఫిర్యాదులు చేసుకోగా, కేసులు నమోదు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల్లోని పోస్టింగులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రత్యర్థులపై కేసులు నమోదు చేయించేలా వివిధ పార్టీలు దృష్టి సారిస్తున్నాయి. ఆయా పార్టీల్లో సామాజిక మాధ్యమాలకు సంబంధించి ప్రత్యేక విభాగాలున్నాయి.



అడ్మిన్లదే పూర్తి బాధ్యత సామాజిక మాధ్యమ గ్రూపుల్లో, ముఖ్యంగా వాట్సాప్‌లో అభ్యంతరకర, విద్వేషాలను రెచ్చగొట్టేలా గ్రూపులోని సభ్యులెవరు పోస్టులు పెట్టినా అడ్మిన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పోలీసులు పేర్కొంటున్నారు.

అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిని గ్రూపు నుంచి తొలగించడంతో పాటు సదరు పోస్టును సైతం వెంటనే తొలగించాలి.

గతంలో కేవలం పోస్టు చేసిన వారు మాత్రమే దాన్ని తొలగించే అవకాశముండగా ప్రస్తుతం గ్రూపులోని ఏ సభ్యుడు పెట్టిన పోస్టునయినా అడ్మిన్ తొలగించే వీలుంది.గ్రూప్‌లో కొత్త సభ్యులను చేర్చుకునే ముందు వారి అనుమతి తీసుకోవడంతో పాటు తప్పుడు పోస్టులు పెట్టిన వారిని తొలగించి పోలీసులకు సమాచారం అందించాల్సిన బాధ్యత కూడా అడ్మిన్‌దే.సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యే తప్పుడు పోస్టులపై, ఎవరూ ఫిర్యాదు చేయకపోయినా పోలీసులు సుమోటోగా కేసులు నమోదు చేసే అవకాశముంది. ఎన్నికల వేడి రాజుకుంటున్న నేపథ్యంలో ప్రత్యర్థులను అవమానపరిచేలా, తమ అభ్యర్థి గొప్పతనాన్ని వివరిస్తూ పోస్టులు పెట్టే అవకాశముంది.

ప్రత్యర్థులను కించపరిచే వ్యాఖ్యలు, వ్యక్తిగత దూషణలు, ఫొటోలు మార్చి, వాయిస్ మెసేజ్‌లు వాస్తవ విరుద్ధంగా పోస్టులు పెట్టినా, వాటిని షేర్ చేసినా, వాటికి మద్దతు తెలుపుతూ కామెంట్లు చేసినా చట్టరీత్యా శిక్షలు తప్పవు. తమ అనుమతి లేకుండా గ్రూపులో చేర్చుకునే అవకాశం లేకుండా వాట్సాప్‌లో ప్రత్యేక ఆప్షన్‌ను చరవాణి వినియోగదారులు ఎంచుకోవడం ఉత్తమం.


# మంచి రోజు చూసుకొని మరీ..

కరీంనగర్: సార్వత్రిక ఎన్నికల పర్వంలో మరో మూడు రోజుల్లో అసలు అంకం ప్రారంభం కానుంది. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ మొదలవనుంది. 25వ తేదీ వరకు నామపత్రాల దాఖలుకు గడువుండగా ప్రధాన పార్టీల అభ్యర్థులంతా మంచి రోజు చూసుకొని సమర్పించేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో అధికార యంత్రాంగం నామినేషన్ల స్వీకరణకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.ఎన్నికల సంఘం ఆదేశాలతో లోక్‌సభ నియోజకవర్గ కేంద్రంలోనే నామపత్రాలు స్వీకరించనున్నారు. దీంతో కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ జిల్లాకేంద్రాల్లో ఎన్నికల అధికారులైన కలెక్టర్లు అభ్యర్థుల నుంచి నామినేషన్లు తీసుకుంటారు. ఇందుకోసం కలెక్టర్ ఛాంబర్లలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్ణీత వేళల్లో పోటీదారుల నుంచి నామినేషన్ పత్రాలతోపాటు అఫిడవిట్‌లను సేకరించనున్నారు. సెలవు దినమైనమినహా అన్ని రోజుల్లో నామినేషన్ల స్వీకరణ కొనసాగనుంది.ముహూర్త బలం చూడాలి

కొత్త తెలుగు సంవత్సరంలో మంచి ముహూర్తాల ఆధారంగా అభ్యర్థులు నామినేషన్లు వేయాలని నిర్ణయించారు. కరీంనగర్‌లో ఈ నెల 19వ తేదీన తొలి సెట్ నామినేషన్ వేస్తానని భాజపా అభ్యర్థి బండి సంజయ్ ఇప్పటికే ప్రకటించారు. భారాస అభ్యర్థి వినోద్‌కుమార్ 19 లేదా 20వ తేదీన వేసేందుకు సమాయత్తమవుతున్నారు. పెద్దపల్లిలో గడ్డం వంశీ(కాంగ్రెస్), కొప్పుల ఈశ్వర్(భారాస), గోమాసె శ్రీనివాస్(భాజపా)లు పురోహితులు సూచించిన తేదీల్లో ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. మంచి ముహూర్తాన ఒక సెట్‌ను వేసి తర్వాత మిగతా సెట్లను సమర్పించాలని అభ్యర్థులు భావిస్తున్నట్లు తెలిసింది. ఇక నిజామాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి కూడా నామపత్రం వేసేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు సమాచారం.ముఖ్య నేతలకు ఆహ్వానం వాస్తవానికి 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు గడువుండగా 21వ తేదీ వరకే ముహూర్తాలు ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు కూడా తొలి మూడు రోజుల్లోనే వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక కీలకమైన కరీంనగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఇప్పటికీ ఖరారు కాలేదు. దీంతో పార్టీ శ్రేణులు అధిష్ఠానం నిర్ణయంపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నెల 15న ప్రకటిస్తారని కొందరు చెబుతుండగా నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యాకే అభ్యర్థి పేరును వెల్లడిస్తారన్న అభిప్రాయాన్ని మరికొందరు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా ప్రకటించాలని అందరూ కోరుకుంటున్నారు. ఇక నామినేషన్ల ప్రక్రియకు రాష్ట్ర స్థాయి ముఖ్య నేతలను ఆహ్వానించి వారి సమక్షంలో పత్రాలు సమర్పించాలని అభ్యర్థులు భావిస్తున్నారు.




ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య ఆలయం లో ఈసారి శ్రీరామనవమి వేడుకలు అంబరాన్నంటాయి. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ జరిగిన తర్వాత తొలి నవమి ఇదే కావడంతో అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. స్వామి దర్శనం కోసం దేశవిదేశాల నుంచి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయంలో అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. బాలరాముడి నుదిటిపై కన్పించిన 'సూర్య తిలకం తో భక్తజనం పరవశించిపోయింది.




హైదరాబాద్: తెలంగాణలో రాగల 3 రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఇవాళ మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల్లో, గురువారం... కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని వెల్లడించింది. ఈ జిల్లాలకు వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

**కొన్ని జిల్లాలకు మోస్తరు వర్ష సూచన...** ద్రోణి.. దక్షిణ విదర్భ నుంచి మరట్వాడ, ఉత్తర అంతర్గత కర్ణాటక నుంచి దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని తెలిపింది. మరో ద్రోణి.. మన్నార్ గల్ఫ్ నుంచి అంతర్గత తమిళనాడు, రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి. మీ ఎత్తులో కొనసాగుతోందని పేర్కొంది. వీటి ప్రభావంతో బుధ, గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

## కూకట్‌పల్లిలోని రాముడిని దర్శించుకున్న కేటీఆర్



హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా సాగుతున్నాయి. కూకట్‌పల్లిలోని ప్రముఖ, ప్రాచీన రామాలయంలో జరిగిన సీతారామచంద్రస్వామి కళ్యాణ మహోత్సవములో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని పూజలు చేశారు. కేటీఆర్ రాకతో ఆలయ పరిసరాల్లో సందడి మొదలైంది. జై శ్రీరామ్ నినాదాలతో భక్తులు హోరెత్తించారు. కేటీఆర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు కూడా ఉన్నారు.

## మోదీ వేవ్ లేదట.. వివాదంలో భాజపా అభ్యర్థి నవనీత్ రాణా

ముంబయి: 'మోదీ వేవ్ లేదు' అంటూ భాజపా అభ్యర్థి నవనీత్ రాణా అన్నట్టుగా ఉన్న వీడియో ఒకటి వైరల్‌గా మారింది. మహారాష్ట్రలోని తన సిటింగ్ నియోజకవర్గం అమరావతిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె ఈ వ్యాఖ్యలు చేసినట్లు తెలుస్తోంది. ఇదికాస్తా ప్రత్యర్థులకు అస్త్రంగా మారింది. "పంచాయతీ ఎన్నికల మాదిరిగానే ఈ ఎన్నికల్లోనూ పోరాడాలి. మధ్యాహ్నం 12 కల్లా ఓటర్లందరినీ బూత్‌కు తీసుకురావాలి. మోదీ వేవ్ ఉందనే భ్రమలో ఉండకండి. 2019లో కూడా మోదీ వేవ్ ఉంది. కానీ నేను అప్పుడు స్వతంత్ర అభ్యర్థిగా గెలిచాను" అని ఆమె అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌సీపీ మద్దతుతో అమరావతి నుంచి ఆమె విజయం సాధించారు. ఇదిలాఉంటే.. ఈ వీడియోపై ఎన్‌సీపీ(శరద్‌పవార్), శివసేన(యూబీటీ) విమర్శలు గుప్పించాయి. భాజపా క్యాడర్‌లో భయం నెలకొని ఉందన్నాయి. "మోదీ వేవ్ గురించి మర్చిపోండి. ఆయన తన సొంత స్థానాన్ని గెలుచుకోగలరా లేదా అన్నది కూడా ప్రశ్నే. భాజపా దేశవ్యాప్తంగా 45 స్థానాలు మాత్రమే గెలుస్తుందని ఇప్పటికే మన అధినేత(ఉద్ధవ్ ఠాక్రే) చెప్పారు. చివరకు ఆ పార్టీ నేతలు బహిరంగంగా నిజాలు చెప్తున్నారు" అని శివసేన(యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వివాదంపై నవనీత్ వివరణ ఇచ్చారు. ప్రతిపక్షాలు తన ప్రసంగాన్ని వక్రీకరించాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. "మోదీ నేతృత్వంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయో ప్రజలకు తెలుసు. ఇప్పుడు, ఎప్పుడూ మోదీ వేవ్ ఉంటుంది. ఆయన చేసిన పని, ఇచ్చిన హామీలు చెప్పి ఓట్లు అడుగుతున్నాం. 400 సీట్ల లక్ష్యాన్ని చేరుకుంటాం" అని వెల్లడించారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194





భద్రాచలం: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో శ్రీ సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. మిథిలా మైదానంలో ఈ వేడుక నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాల నడుమ అభిజిత్ లగ్నంలో కల్యాణ క్రతువును వేదపండితులు పూర్తిచేశారు. భద్రాచలం పుర వీధులన్నీ శ్రీరామ నామస్మరణతో మార్మోగాయి. తెలంగాణ ప్రభుత్వం తరపున సీఎస్ శాంతికుమారి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు.

**హాజరైన మంత్రులు** : భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయంలో తిరుకల్యాణ బ్రహ్మో త్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రధానఘట్టం ఆవిష్కృతం. శ్రీ రామనామస్మరణతో భద్రాచలం పురవీధులు మార్మోగుతున్నాయి. కాగా, శ్రీరామ నవమి సందర్భంగా రాముల వారి కల్యాణానికి మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా హాజరై స్వామి వారిని దర్శించుకొని పూజల చేశారు. అలాగే కల్యాణం తిలకించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచి భద్రాద్రికి భక్తులు చేరుకున్నారు. ప్రభుత్వం తరపున స్వామివారికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పట్టువస్త్రాలు సమర్పించారు. స్వామివారి కల్యాణానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల కోసం ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, కూలర్లు ఏర్పాటు చేశారు.

## మూడు నెలల్లో భారాస దుకాణం బంద్: మంత్రి కోమటిరెడ్డి



నల్గొండ: లోక్‌సభ ఎన్నికల్లో భారాసకు ఒక్క సీటు కూడా రాదని.. వస్తే తాను దేనికైనా సిద్ధమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని ఆ పార్టీ నేతలు చూస్తున్నారని ఆరోపించారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం పతనం అవుతుందంటూ భారాస అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై కోమటిరెడ్డి ఘాటుగా స్పందించారు. తమను టచ్ చేస్తే భారాసను పునాదులతో సహా పెకిలిస్తామని హెచ్చరించారు. మూడు నెలల్లో ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందని.. ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రమే వారికి మిగులుతారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, భాజపా మధ్యే పోటీ ఉంటుందని చెప్పారు. 12-13 సీట్లు తమ పార్టీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. "ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌తో కేసీఆర్, కేటీఆర్ ఏదేదో మాట్లాడుతున్నారు. వాళ్లిద్దరూ త్వరలో జైలుకు వెళ్లడం ఖాయం. చర్లపల్లి జైలులో డబుల్ బెడ్‌రూమ్ కట్టించి స్వాగతం పలుకుతాం" అని మంత్రి వ్యాఖ్యానించారు.




హైదరాబాద్: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఎన్నికల కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని ఈ మేరకు నోటీసులు ఇచ్చింది. సిరిసిల్లలో సీఎం రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై నోటిసులు జారీ చేసింది. కాంగ్రెస్ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నోటీసులు ఇచ్చింది. గురువారం (18వ తేదీ) లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. గురువారం ఉదయం 11 గంటలలోగా కేసీఆర్ వివరణ ఇవ్వాల్సి ఉంది. ఈ మేరకు బుధవారం రాత్రి ఈసీ నోటీసులు ఇచ్చింది. సిరిసిల్ల సభలో సీఎం రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కేసీఆర్‌పై కాంగ్రెస్ నేత నిరంజన్ రెడ్డి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం రాత్రి కేసీఆర్‌కు ఈసీ నోటీసులు జారీ చేసింది. గతసారి కూడా అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రతిపక్ష పార్టీలపై కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారని అప్పట్లో ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఎలక్షన్ కమిషన్ సీరియస్ అయింది. కేసీఆర్, కేటీఆర్‌కు కూడా నోటీసులు జారీ చేసింది. తాజాగా పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అనుచిత వ్యాఖ్యలతో అన్ని రాజకీయ పార్టీలు ముందుకు వెళుతుండడంతో ఈసీ సీరియస్‌గా ఉంది. ఈ నేపథ్యంలో సిరిసిల్లలో కేసీఆర్ నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కాంగ్రెస్, సీఎం రేవంత్ రెడ్డిపై కేసీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. తెలంగాణలో 17 పార్లమెంట్ స్థానాలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. అభ్యర్థులు దరఖాస్తు చేసుకోడానికి ఏప్రిల్ 25 వరకు అవకాశముంది. మే 13న పోలింగ్... జూన్ 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల నిర్వహణ కోసం ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. కాగా షెడ్యూల్ విడుదల అయిన నాటి నుంచి పోలీసులు దాదాపు రూ. వంద కోట్లకు పైగా నగదు సీజ్ చేశారు. ఇప్పటికే 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ, బీఆరెస్ పార్టీలు ప్రకటించాయి. అధికారి పార్టీ కాంగ్రెస్ 14 చోట్ల అభ్యర్థులను ఖరారు చేసింది.

## ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి.. రెండు కి.మీ. ఈడ్చుకెళ్లిన లారీ డ్రైవర్

హైదరాబాద్: పాతబస్తీలో భయానక ఘటన చోటుచేసుకుంది. ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన లారీ డ్రైవర్ ఆపకుండా రెండు కిలో మీటర్లు ఈడ్చుకెళ్లాడు. ప్రమాదంలో బైక్.. లారీ కింద చిక్కుకుని, వాహనదారుడు బ్యానెట్‌పైనే నిలబడి ఆర్థనాదాలు చేసినా ఆ డ్రైవర్ పట్టించుకోలేదు. ఆపకుండా లారీని ముందుకు పోనిచ్చాడు.

ఓ కారు డ్రైవర్ ఇందంతా వీడియో తీయడంతో విషయం వెలుగుచూసింది. వీడియో ఆధారంగా పోలీసులు లారీ డ్రైవర్‌ని పట్టుకున్నారు.




## హైదరాబాదీ మాంస ప్రియులకు బ్యాడ్ న్యూస్.. ఈ ఆదివారం నాన్-వెజ్ దొరకదు

హైదరాబాద్: ఆదివారం వచ్చిందంటే చాలా మంది ఇళ్లలో నాన్ వెజ్ కూరలు ఘుమఘుమలాడుతుంటాయి. చికెన్, మటన్ లేదా చేపలు, రొయ్యలు ఇలా ఎవరికి నచ్చిన మాంసాహారాన్ని వారు తెచ్చుకొని తింటుంటారు. ఇక హైదరాబాద్ లాంటి మహానగరాల్లో మాంసాహార ప్రియుల సంఖ్య కాస్త ఎక్కువగా ఉంటుందనే చెప్పాలి. అయితే వారందరికీ నిరుత్సాహం కలిగించే చిన్న బ్యాడ్‌న్యూస్ ఏంటంటే.. వచ్చే ఆదివారం (ఏప్రిల్ 21) హైదరాబాదీ మాంసం దొరకదు. ఎందుకంటే మహావీర్ జయంతి సందర్భంగా సిటీలోని కబేళాలతో పాటు అన్ని మాంసం దుకాణాలను ఆదివారం మూసివేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో భాగ్యనగర పరిధిలోని మాంసం దుకాణాలు ఆదివారం మూతపడనున్నాయి. కాగా జైనులకు మహావీర్ జయంతి అత్యంత ముఖ్యమైన పండుగనే విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరంలో జైనుల సంఖ్య గణనీయంగా ఉండడంతో జీహెచ్ఎంసీ ఈ నిర్ణయం తీసుకుంది. కాగా హైదరాబాద్ నగరంలో మాంసం విక్రయాలు గణనీయ సంఖ్యలో ఉంటాయి. సిటీలో పెద్ద సంఖ్యలో ఉన్న జనాభాతో పాటు వేలాది సంఖ్యలో ఉన్న హొటళ్లు, రెస్టారెంట్ల యాజమాన్యాలు కూడా ప్రతి రోజూ భారీ మొత్తం మాంసం ఉత్పత్తులను కొనుగోలు చేస్తుంటాయి. ఆదివారం ఈ పరిణామం మరింత ఎక్కువగా ఉంటుందనే విషయం తెలిసిందే.




PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660